


ప్రతీ ఓటరు తప్పక ఓటు వేయాలి

10




కలెక్టర్ శశాంక

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శశాంక

నోటికి తాళం.. ఓటుకు గాలం..!



- ఆగిన ప్రసంగాలు, నిలిచిన ప్రచార రథాలు
- 23రోజుల పాటు హోరెత్తిన ప్రచారం
- చివరి రోజు పోటా పోటీగా కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతల సభలు



రంగారెడ్డి అర్బన్, మే 11 : లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం పర్వం శనివారం సాయంత్రం ముగిసింది. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 43 మంది, మల్కాజిగిరి నుంచి 22మంది అభ్యర్థులు బరిలో దిగారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు నెల రోజులుగా ప్రచారం హోరెత్తించారు. ప్రచారంలో ఆఖరు రోజు విరామం లేకుండా ప్రచారాన్ని కొనసాగించారు. పోలింగ్‌కు సమయం సమీపించడంతో ఎంపీలుగా పోటీ చేస్తున్న అభ్యర్థుల వాయిస్ కాల్స్‌తో పాటు ఓటర్ల ఫోన్లు హోరెత్తించారు.

ప్రలోభాలకు ఎర

ప్రచారానికి తెర పడటంతో ఇక ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 29,38,370 ఓటర్లున్నారు. వీరిలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 7,58,102మంది ఉన్నారు. వీరంతా ఏ పార్టీకి వేయబోతున్నారనేది హాట్ టాపిక్‌గా మారింది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 37,79,596 ఓటర్లున్నారు. అత్యధిక మంది ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నగదు, కానుకల రూపంలో ఓటర్లను ఆకర్షించే పనిలో ఉన్నారు. దీని కోసం ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో ఓటుకు రూ. 500 పంచేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది శనివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు నగదు పంపిణీ చేసే అవకాశాలున్నాయి.

నేతలకు ప్రతిష్టాత్మకమే..

తమ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం వ్యూహాలు రచిస్తూనే సొంత నియోజకవర్గాల్లో మెజార్టీ కోసం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

మిగతా 8వ పేజీలో...

మాది అభివృద్ధి పథం

100 రోజుల్లోనే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశాం



- స్కైవేల నిర్మాణ పనులు చేపట్టాం
- సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పెండింగ్ పనులు పూర్తిచేస్తాం
- బస్తీలన్నింటికీ మౌలిక సదుపాయలు కల్పిస్తాం
- మల్కాజిగిరి అభివృద్ధి పూచీ నాది
- జడ్పీ చైర్‌పర్సన్‌గా ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశా
- నిండు మనసుతో ఆశీర్వదించండి
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి

ఇంటర్వ్యూ...

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)


అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగిన పట్నం సునీతారెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్న సునీతారెడ్డి ఆయా ప్రాంతాలను తిరుగుతూ అన్నివర్గాల వారిని కలుస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సునీతారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తమది అభివృద్ధి, సంక్షేమ బాట అన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ స్కీమ్‌లతో ప్రజలు ఎంతో ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. ఈ సంక్షేమ పాలన అభివృద్ధి కొనసాగాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని చెప్పారు. గతంలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ పర్సన్‌గా ఈ

మిగతా 8వ పేజీలో...

వికారాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ ఫస్ట్ స్టాప్!

పేదలను ఆదుకుంటున్న మోదీ : కొండా

చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, చైనా, పాకిస్తాన్ ఉగ్రవాదుల నుంచి మోదీ మన దేశాన్ని కాపాడుతున్నారన్నారు. పేద కుటుంబాలకు బియ్యం ఇచ్చి పేదలను ఆదుకుంటున్నారని, దేశాన్ని, ధర్మాన్ని కాపాడుతున్నారని చెప్పారు. మోదీ కష్టపడేదంతా మన దేశం, మన ప్రజల కోసమేనన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన సమయంలో తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఉంటే... పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి కొత్త ప్రభుత్వానికి చేతిలో చిప్ప పెట్టిందన్నారు. కాళేశ్వరం కట్టించి దివాలా తీయించారన్నారు. రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయంటే అది మోదీ వల్లనేనని చెప్పారు. బియ్యమైనా, రైతులకు ఎరువులైనా, వీధి లైట్లయినా, చివరకు శ్మశాన వాటికలైనా కేంద్ర ప్రభుత్వం సహకారంతోనే కొనసాగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటేసి చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



అమిత్‌షాతో కలిసి అభివాదం చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి
- ఎంఎంటీఎస్ ఫేజ్-2 పనులకు ఆమోదం
- వికారాబాద్ జనసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

వికారాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): బుల్లెట్ ట్రైన్ ఫస్ట్ స్టాప్ హైదరాబాద్ తర్వాత వికారాబాద్‌లో ఉంటుందని, కొండా మీకు అండగా ఉంటాడని, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్ల ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వికారాబాద్ ఎస్ఏపీ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ జనసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీపై ఒక్క అవినీతి మరక కూడా లేదని, మోదీ, రాహుల్‌ల్లో ఎవరు కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. జిల్లాకు సంబంధించి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరున్నా..పనులు జరగడం లేదని, మరో కాళేశ్వరం మాదిరిగానే మారబోతోందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో జిల్లా అభివృద్ధికి ఉజ్వల భవిష్యత్తు ఉండనుందన్నారు. రూ.1,100 కోట్లతో హైదరాబాద్ నుంచి మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) ఫేజ్-2 పనులకు కేంద్రం అనుమతించిందని, త్వరలో ప్రారంభం కానున్నాయని చెప్పారు. కొండా వెంకటరంగారెడ్డి కుటుంబం నుంచి వచ్చిన విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. ఇదిలా ఉంటే, చిల్కూరు బాలాజీ, సేవాలాల్ మహరాజ్, అమ్మపల్లి సీతారామచంద్రస్వామిని స్మరిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన అమిత్‌షా... స్వాతంత్ర్య సమరయోధుడు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తాతగారు, దివంగత ఉప ముఖ్యమంత్రి కొండా వెంకటరంగారెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గుల్బర్గా ఎంపీ డాక్టర్ ఉమేష్ జాదవ్, బీజేపీ రాష్ట్ర నేత తూళ్ల వీరేందర్‌గౌడ్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొకట్ మాధవ రెడ్డి, పార్టీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ

మిగతా 8వ పేజీలో...



వికారాబాద్‌లో బీజేపీ సభకు హాజరైన జనం

ఈ గడ్డతో ప్రత్యేకానుబంధం

చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ, శ్రీరాముడు అందరి దేవుడని, దేవాలయ నిర్మాణానికి స్వయంగా తాను రూ.10 లక్షల విరాళం ఇస్తే, రాముడి పేరు చెప్పుకుని ఓట్లు అడుగుతున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అయోధ్య రామాలయానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గత ఐదేళ్లలో ఎంపీగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉన్నానని, కరోనా సమయంలో ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకున్నానని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి రావడం కల్ల అని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మారిస్తే ఊరుకోబోమని, పార్లమెంట్ హక్కులు కాపాడే పని చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఆరు నూరైనా అమలు చేస్తామని, వాటిలో ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌కే దక్కిందని చెప్పారు. చెయ్యి గుర్తుకు ఓటేసి చేవెళ్ల అభివృద్ధికి సహకరించాలన్నారు. మరోసారి తనను ఆశీర్వదించాలని, రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తానని ఆయన చెప్పారు. అన్ని సర్వేలు తన విజయం ఖాయమని చెబుతున్నాయని, ఎన్నికల్లో తనదే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రాముడి పేరుతో ఓట్లడుగుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి: రంజిత్‌రెడ్డి



సభలో అభివాదం చేస్తున్న ప్రియాంక, రంజిత్‌రెడ్డి

- ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించండి
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ
- రాష్ట్రంలో కీలకమైన సీఎం, స్పీకర్ పదవులు జిల్లాకే దక్కాయి
- కందులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం
- ఎంఎంటీఎస్ వికారాబాద్ వరకు పొడిగింపు..
- గత పాలకులు వికారాబాద్‌ను కరువు జిల్లాగా మార్చేశారు
- తాండూరులో జరిగిన కాంగ్రెస్ జనజాతరలో సీఎం రేవంత్‌రెడ్డి

తాండూరు, మే11: ఈ గడ్డతో ప్రత్యేక అనుబంధం ఉందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా శనివారం తాండూరు విలియంమూన్ మైదానంలో జరిగిన కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభలో ఆమె ఈ ప్రాంతంతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాంతం ఇందిరాగాంధీకి ప్రేమను పంచిందని ప్రియాంక గాంధీ అన్నారు. అందుకే ఈ ప్రాంతంపై తమకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం, అసెంబ్లీ స్పీకర్ వంటి అత్యంత కీలకమైన పదవులు వికారాబాద్ జిల్లాకే దక్కాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతానికి తీరని నష్టం జరిగిందన్నారు. అనంతగిరిలో పుట్టిన మూసీ నది నీరు

మిగతా 8వ పేజీలో...



తాండూరులో కాంగ్రెస్ పార్టీ సభకు హాజరైన జనం

మాట్లాడుతున్న చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



వికారాబాద్‌లో బుల్లెట్ ట్రైన్
ఫస్ట్ స్టాప్!

(ఏడో పేజీ తరువాయి)

చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు మాట్లాడారు. మూడోసారి ప్రధాని మోదీయే నని.. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు.

ఈ కార్యక్రమంలో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి బి.జనార్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, పార్లమెంట్ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, కన్వీనర్ మల్లారెడ్డి, కొండా విశ్వజిత్‌రెడ్డి, వెన్న ఈశ్వరప్ప, అంజన్ కుమార్ యాదవ్, కంజర్ల భాస్కర్, సంగీతరెడ్డి, కె.శివరాజ్, సదానంద రెడ్డి, రమేష్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, రంగారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వడ్ల నందు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే, వికారాబాద్ సభలో అమిత్‌షా చిల్కూరు, అమ్మపల్లి దేవుళ్లను స్మరించి అనంతగిరి కొండల్లో కొలువుదీరిన అనంతపద్మనాభస్వామి గురించి ప్రస్తావించకపోవడంతో స్థానికులు నిరాశకు గురయ్యారు.



అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న మాధవరెడ్డి

కాషాయంలో నయా జోష్!

కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా వికారాబాద్ జిల్లా పర్యటన కాషాయంలో నయా జోష్ నింపింది. సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలి రావడం పార్టీ వర్గాల్లో కొత్త ఉత్సాహం నింపింది. రంగారెడ్డి జిల్లా పేరు కొండా వెంకటరంగారెడ్డి పేరు నుంచే ఏర్పాటైందని, ఆ కుటుంబం నుంచే వచ్చిన విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అమిత్ షా పిలుపునివ్వగా సభికుల నుంచి అనూహ్య స్పందన లభించింది. అమిత్ షా బహిరంగ సభతో వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో బీజేపీకి మరింత పట్టు పెరిగినట్లేనని ఆ పార్టీ భావిస్తోంది. జిల్లా పరిధి లోకి వచ్చే ఈ మూడు నియోజకవర్గాల్లోనూ పైచేయి బీజేపీదేనన్న ధీమా కమలం శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఈ గడ్డతో ప్రత్యేకానుబంధం

(ఏడో పేజీ తరువాయి)

జిల్లాకు ఉపయోగం కాకుండాపోయిందని, గత పాలకులు ఈ విషయమై దృష్టి సారించలేదన్నారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లాను కరువు జిల్లాగా గత పాలకులు మార్చేశారని ఆయన ఆరోపించారు. వికారాబాద్ పట్టణాన్ని శాటిలైట్ సిటీగా అభివృద్ధి పరిచే పనులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో అభివృద్ధి అర్థాంతరంగానిలిచిపోయిందన్నారు. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ పొడిగించాలని డిమాండ్ చాలా కాలంగా ఉన్నా.. ఇంతవరకూ వికారాబాద్ వరకు రాకుండా చేశారని ఆయన ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులు కాంగ్రెస్ హయంలోనే వచ్చాయన్నారు. చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి గెలుపొందిన తర్వాత ఎంఎంటీఎస్ వికారాబాద్ వరకు పొడిగింపుతో పాటు జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టులను అభివృద్ధి పరిచే పనులు చేపడతామని ఆయన చెప్పారు. జిల్లా రైతులు అధికంగా పండించే కందులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలని రేవంత్‌రెడ్డి కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత సాధించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని అన్నారు.

కాంగ్రెస్ సభ విజయవంతం

తాండూరులో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభ విజయవంతమైంది. కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రియాంకాగాంధీ సభకు భారీగా ప్రజలు తరలి రావడం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఊపు తీసుకువచ్చింది. నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సభ ప్రాంగణం నిండిపోయింది. మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రియాంకాగాంధీ రావాల్సి ఉండగా, పార్టీ శ్రేణులు, ప్రజలు సభకు జనం ఉదయం 11 గంటల నుండే రావడం ప్రారంభించారు. ప్రియాంక గాంధీ హెలీ క్యాప్టర్‌లో సభా స్థలానికి 3 గంటలకు చేరుకున్నారు. ఆమె గంటకు పైగా ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగానికి జనం కేరింతలు కొట్టారు. వేదికపై మూడు రంగుల జెండా పెట్టి పాటపైన ప్రియాంకాగాంధీ, రేవంత్‌రెడ్డి నృత్యం చేశారు. సభ విజయవంతం కావడం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆయన వర్గంలో ఉత్సాహం నింపింది. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించారు.



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



ప్రియాంకకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మతతత్వ పార్టీ కావాలా.. లౌకిక వాద పార్టీ కావాలా?

» స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ : మతతత్వ పార్టీ బీజేపీ కావాలా..? లేదా లౌకిక వాద పార్టీ కాంగ్రెస్ కావాలా అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నించారు. శనివారం వికారాబాద్ లో కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ నెల 13న జరుగబోయే ఎన్నికల్లో మన చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి అత్యధిక మేజార్టీతో గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలు అందరికి ఉపయోగపడే పథకాలన్నారు. కోడి గుడ్లలో అవినీతి చేశానని అంటున్నారని గుడ్డును కల్తీ చేసే మోగాడు ఉన్నాడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మండల అద్యక్షుడు రాజు, నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాది అభివృద్ధి పథం

(ఏడో పేజీ తరువాయి)

ప్రాంత అభివృద్ధి కోసం ఎంతో పని చేశానని మళ్లీ ఎంపీగా అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఇంకేమన్నారో ఆమె మాటల్లోనే... మల్కాజిగిరి నియోజకవర్గం దేశంలోనే అతిపెద్దది. ఈ ప్రాంతంలో పని చేసిన ప్రజాప్రతినిధులెందరో ఉన్నత స్థాయికి ఎదిగారు. చెన్నారెడ్డి, దేవేందర్ గౌడ్, సర్వే సత్యనారాయణ, ఉమా వెంకట్రామిరెడ్డి తదితర నేతలందరో ఈ ప్రాంతం నుంచే రాజకీయాల్లో ఎదిగారు. ఇక్కడ నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన రేవంత్‌రెడ్డి కూడా ఇపుడు సీఎం అయ్యారు. ఎంతో మంది రాజకీయ నేతలకు అవకాశం కల్పించిన ఈ ప్రాంత ప్రజలు ఈ సారి నన్ను ఆదరించాలని కోరుతున్నాను. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి నేను పూచీ తీసుకుంటాను. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంతంలో పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాను. గతంలో ఉమ్మడి జిల్లాకు జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సమయంలో ఈ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశాను. ప్రచారానికి వెళ్లినపుడు ప్రజలు వాటిని గుర్తు చేస్తున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోంది. మా అధినేత రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం. నియోజకవర్గంలో ట్రాఫిక్ రోడ్డు సమస్యలు అధికంగా ఉన్నాయి. అనేకచోట్ల మౌలిక సదుపాయాలు లేక బస్తీవాసులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు కాలనీలు, బస్తీలు మునిగిపోతున్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులకు. రోడ్ల విస్తరణకు దాదాపు రూ. 50వేల కోట్ల నుంచి 60వేల కోట్లు అవసరమవుతాయని అంచనా. వీటిని తక్షణమే చేపట్టి ప్రజలకు ఈ ఇబ్బందుల నుంచి శాశ్వతంగా విముక్తి కలిగిస్తాం.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజులకే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాల వారికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. అప్పులు పాలైన తెలంగాణను సీఎం రేవంత్‌రెడ్డి గాడిలో పెట్టారు. కాంగ్రెస్ పాలన వచ్చిన తరువాత ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కైవే నిర్మాణ పనులను ప్రారంభించాం. త్వరలో ఈ నియోజకవర్గ పరిధిలో మెట్రో రైలు నిర్మాణ పనులు కూడా చేపట్టబోతున్నాం. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఈ పనులు చేపట్టలేక పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఈ పనులు ప్రారంభించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు కొనసాగించాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలి. నియోజకవర్గ పరిధిలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం మా ప్రభుత్వం అనేక ప్రణాళికలు అమలు చేయనుంది. ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మాకు పోటీనే కాదు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారు. ఈ ఎన్నికల్లో పోరాడే స్థితిలో లేదు. ఇక బీజేపీ ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తుంది. ప్రజలు కూడా ఇది గమనిస్తున్నారు.

పార్టీ కేడర్ సహకారంతో ముందుకు...

కాంగ్రెస్ కేడర్ ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ఎంతో కష్టపడి పనిచేస్తోంది. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఒక్క ఎమ్మెల్యే కూడా మాకు లేకపోయినా కేడర్ కాంగ్రెస్ గెలుపుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. నియోజకవర్గమంతటా బలమైన కేడర్ ఉంది. అక్కడక్కడా చిన్న సమస్యలున్నా అందరం సర్దుకుపోయి ఈ స్థానంలో గెలుపు కోసం పనిచేస్తున్నాం.

నోటికి తాళం.. ఓటుకు గాలం..!

(ఏడో పేజీ తరువాయి)

తీవ్రంగా శ్రమిస్తున్నారు. నాయకులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ అభ్యర్థి విజయానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. గ్రామాల వారీగా తమ బలాబలాలపై సమీక్షిస్తూ తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు పావులు కదుపుతున్నారు.

అగ్రనేతల ప్రచారం..

లోక్‌సభ ఎన్నికల ప్రచారం పర్వం ముగింపులో భాగంగా చివరి రోజు ప్రధాన పార్టీల అగ్రనేతలు పశ్చిమ రంగారెడ్డిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వికారాబాద్ సభలో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున ప్రచారం చేశారు. అలాగే తాండూరులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సభలో ఆ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. వారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తరపున ప్రచారాన్ని హోరెత్తించారు. మల్కాజిగిరి స్థానం దక్కించుకోవాలని కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారు.

కొండా గెలుపు దేశాభివృద్ధికి దోహదం

● బీజేపీ నాయకులు.. జోరుగా ఎన్నికల ప్రచారం



శంకర్‌పల్లి : ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు, మే 11 : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు దేశాభివృద్ధికి దోహదపడుతుందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జిట్ట రాజేందర్‌రెడ్డిలు అన్నారు. కందుకూరు మండలం దెబ్బడగూడలో ఇంటింటి ప్రచారం చేశారు. కొంతం జంగారెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, కె.చెన్నారెడ్డి, తదితరులున్నారు.

బీజేపీలోకి రొంపల్లి ఎంపీటీసీ

బంట్వారం : రొంపల్లి ఎంపీటీసీ, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆయన అనుచరులు 200 మంది శనివారం వికారాబాద్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని నాయకులు వారికి సూచించారు. చందు తదితరులున్నారు.

కొండాను గెలిపించాలి

దోమ : కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కేఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. దోమ మండలం కొత్తపల్లిలో ఉపాధి కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. మోత్కూర్‌కు చెందిన యువత విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతు తెలిపారు. ప్రచారంలో లింగయ్య, శివకుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రచారం

తాండూరు రూరల్ : తాండూరు మండలం గోనూరు, వీర్‌శెట్టిపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ ఆధ్వర్యంలో విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



కందుకూరు : దెబ్బడగూడలో ప్రచారం చేస్తున్న దేవేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, తదితరులు

మండల ఉపాధ్యక్షుడు జగదీష్, ప్రవీణ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి శంకర్‌పల్లి ఎంపీపీ

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి శనివారం మాజీ ఎమ్మెల్యే రత్నం ఆధ్వర్యంలో విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో వికారాబాద్‌లో బీజేపీలో చేరారు. ఆయనతో పాటు చందిప్ప ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు దండు రామ్మోహన్‌లు బీజేపీలో చేరారు. రాములుగౌడ్, బీర్ల సురేష్, వాసుదేవ్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తాం

చేవెళ్ల : చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగరేస్తామని ఎంపీపీ మాల్గారి విజయలక్ష్మి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వెంకట్‌రంగారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం దామరిగిద్దలో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, తదితరులున్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డికి ఆర్యవైశ్యుల మద్దతు

మియాపూర్/రాయదుర్గం : విశ్వేశ్వర్‌రెడ్డికి ఆర్యవైశ్య సంఘం మద్దతు తెలిపింది.మియాపూర్‌లోని ఓ హోటల్‌లో నియోజకవర్గ ఆర్య వైశ్య ఆత్మీయ సమ్మేళనంలో కొండా సతీమణి సంగీతారెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విశ్వేశ్వరరెడ్డికి మద్దతు పలికిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీకి ఓటు వేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాగా, విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మూల అనిల్‌గౌడ్ రాయదుర్గంలో నాయకులతో కలిసి ప్రచారం చేశారు.



మియాపూర్ : మాట్లాడుతున్న సంగీతారెడ్డి



బంట్వారం : నాయకులకు బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మాధవరెడ్డి, వడ్ల నందు



కాసాని గెలుపునకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ● జోరుగా బీఆర్ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం



మియాపూర్ : నాయకులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్/రాయదుర్గం/హైదర్‌నగర్, మే 11 : : కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా హఫీజ్‌పేట, గచ్చిబౌలి, చందానగర్ డివిజన్లలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నాయకులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చేవెళ్ల గడ్డపై మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధిస్తామన్నారు. డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయం నుంచి కాసానికి మద్దతుగా నాయకులతో కలిసి మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఇంటింటి ప్రచారం చేశారు. రాయదుర్గం, టెలికామ్‌నగర్, గచ్చిబౌలి, జీపీఆర్ఏ క్వార్టర్స్, గుల్‌మొహర్ పార్కు, నల్లగండ్ల, గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్, గౌలిదొడ్డి, నానక్‌రాంగూడ మీదుగా గచ్చిబౌలి డివిజన్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. హైదర్‌నగర్ డివిజన్ సాయిప్రశాంత్‌నగర్ ఫేజ్-2, ఇందిరానగర్‌లో కాసానికి మద్దతుగా నాయకులతో కలిసి కార్పొరేటర్ శ్రీనివాసరావు ప్రచారం చేశారు.

యంగ్ లీడర్స్ ఆధ్వర్యంలో ప్రచారం

పూడూరు/దోమ : చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటువేసి గెలిపించాలని యంగ్‌లీడర్స్ ఆధ్వర్యంలో పూడూరు మండలంలో ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కాసానికి మద్దతుగా బీఆర్ఎస్ దోమ వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీటీసీ రాములు ఆధ్వర్యంలో మోత్కూర్, బొంపల్లిలో ప్రచారం చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశం, శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే మైనార్టీలకు గుర్తింపు

చేవెళ్ల : తెలంగాణలో కేసీఆర్‌తోనే మైనార్టీలకు మంచి గుర్తింపు వచ్చిందని, చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్‌కు మైనార్టీలందరూ మద్దతుగా ఉంటామని మండల మైనార్టీ నాయకులు సయ్యద్ జాఫర్, అబ్దుల్ ఘనీ, ఇక్రమోద్దీన్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో కాసానికి మద్దతు తెలుపుతూ చేవెళ్ల మండల మైనార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, ఇన్‌చార్జి రాంబాబు, మాజీ సర్పంచ్ శివారెడ్డి, నాయకులు, మైనార్టీ నాయకులు తదితరులున్నారు.

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి

శంషాబాద్ రూరల్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బీసీ బిడ్డ కాసానిని గెలిపించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చిలకమర్రి నర్సింహ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనని, ప్రజల కోసం పోరాడిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కాసానిని గెలిపించాలని, లక్ష మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు.

కందుకూరులో భారీ ర్యాలీ

కందుకూరు : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం కందుకూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

నవాబుపేట/సరూర్‌నగర్ : ఎన్నికల్లో చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాంబాబు అన్నారు. శనివారం రాత్రి నవాబుపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు గుర్తుచేశారు. మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ పోలీసు రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ప్రశాంత్‌గౌడ్, నాయకులు తదితరులున్నారు. కాగా, కాసానికి క్రైస్తవ సంఘాలు మద్ధతు ప్రకటించాయి. ఎన్నికల్లో తాము కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కే అండగా నిలుస్తామని సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్, మల్లాపూర్, బాలాజీనగర్‌లలోని చర్చిల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి, మద్ధతు తెలిపారు. కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్లు సూర్లగంటి అర్జున్, అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత సంరెడ్డి వెంకట్‌రెడ్డిలు సరూర్‌నగర్ పరిధిలోని వారి డివిజన్ల పరిధిలోని కాలనీల్లో ప్రచారం చేశారు. అల్మాస్‌గూడ 4వ డివిజన్‌లో వెంకట్‌రెడ్డి, జిల్లెలగూడ 2,19వ డివిజన్లలో భూపాల్‌రెడ్డి, కామేశ్‌రెడ్డి, బడంగ్‌పేట్ మునిసిపల్ ప్లే గ్రౌండ్‌లో కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



కందుకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



చేవెళ్ల : కాసానికి మద్దతు తెలుపుతున్న మైనారిటీ నాయకులు

ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలి

● ప్రజాప్రతినిధులు, నాయకులు
● జోరుగా ఎన్నికల ప్రచారం.. ర్యాలీలు

ఘట్‌కేసర్ రూరల్, మే 11 : ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఘట్‌కేసర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ముఖ్యనాయకులతో పాటు కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని ఎదులాబాద్‌లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేసి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో బీజేపీ మండలాధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, ప్రధాన కార్యదర్శి రాచకట్ల శ్రీశైలం, గ్రామశాఖ అధ్యక్షుడు ఎర్రోళ్ల కుమారస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో బీజేపీ బైక్ ర్యాలీ

హయత్‌నగర్ : హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈటల సతీమణి జమున, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డిలు హాజరయ్యారు. హయత్‌నగర్ నుంచి వర్డ్ అండ్ డీడ్, బంజారాకాలనీ, సీతారాంపురం, ఇన్ఫర్మేషన్ కాలనీ, ముదిరాజ్‌కాలనీ, భాగ్యలత, ఓల్డ్ హయత్‌నగర్, మీదుగా వనస్థలిపురం వరకు ర్యాలీ చేరుకుంది. జమున మాట్లాడుతూ ఈటలను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. దేశం కోసం ప్రధాని మోదీని మరోసారి ప్రధానిని చేయాలని కోరారు. బండారి భాస్కర్, ఎల్లప్ప, జాంజ్యానాయక్, బలరాం, శ్రీధర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్‌ను గెలిపించండి

వనస్థలిపురం : అవినీతి రహిత పాలన కోసం మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. మన్సూరాబాద్ డివిజన్‌లో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని ఈటల జమున ముఖ్యఅతిథిగా హాజరై నర్సింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్ నిర్ణయించే ఈ ఎన్నికల్లో.. ప్రతీఒక్కరు ఓటింగ్‌లో పాల్గొని కమలం గుర్తుకు ఓటువేసి ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాగా, హయత్‌నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవానికి జమున హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈటలను భారీ మెజార్టీతో గెలిపించండి

ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో రాష్ట్ర నాయకులు వనంపల్లి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



వనస్థలిపురం : జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



హయత్‌నగర్ : పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలో పాల్గొన్న ఈటల జమున



ఘట్‌కేసర్ రూరల్ : ఎదులాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రవీణ్‌రావు

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

● యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్

ధారూరు/మొయినాబాద్, మే 11 : రంజిత్‌రెడ్డిని గెలిపించాలని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోల్కుంద సంతోష్‌కుమార్ తెలిపారు. ధారూరు మండలం తరిగోపులలో ప్రచారం నిర్వహించారు. చేవెళ్ల నుంచి ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. విజయభాస్కర్‌రెడ్డి, బుజ్జయ్యగౌడ్, గఫార్, తదితరులున్నారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి ఎంపీటీసీ ఆర్.అర్చన గ్రామంలో ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌తోనే దేశ ప్రగతి సాధ్యం

షాబాద్ : కాంగ్రెస్‌తోనే దేశ ప్రగతి సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి అన్నారు. షాబాద్ మండలం నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో రేగడిదోస్వాడ గ్రామస్థులు వారి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' కూటమిని గెలిపిద్దాం

మహేశ్వరం : ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి ఇండియా కూటమిని బలపరుస్తూ కాంగ్రెస్‌ను గెలిపించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేయడంతో పాటు ప్రధాని పదవిని కూడా తృణప్రాయంగా వదులుకున్న చరిత్రగల కుటుంబం రాహుల్ గాంధీదని, అదే బీజేపీ, బీఆర్ఎస్‌లు దేశం కోసం ఏం వదులుకున్నారో చూపించాలన్నారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఇన్‌చార్జి కేఎల్లార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధారూరు : ప్రచారం నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్

కాంగ్రెస్‌లోకి బాసుపల్లి మాజీ సర్పంచ్

దోమ మండలం బాసుపల్లి మాజీ సర్పంచ్ పద్మశ్రీనివాస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో పరిగిలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, ఎంలాల్‌కృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హస్తం గుర్తుకు ఓటు వేయాలి

హైదర్‌నగర్/చందానగర్/శంషాబాద్ : ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ నాయకులతో కలిసి రంజిత్‌రెడ్డికి మద్దతుగా డివిజన్‌లో ర్యాలీ నిర్వహించారు. రంజిత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిరియాల రాఘవరావు ఆధ్వర్యంలో చందానగర్‌లో ప్రచారం చేశారు. చందానగర్ శ్రీనివాస అపార్టుమెంట్‌లో స్థానికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా నాయకుడు బండి శ్రీకాంత్‌యాదవ్ కోరారు. రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రంజిత్‌రెడ్డికి ఓటువేస్తే అభివృద్ధి జరుగుతుందన్న విషయం ఓటర్లు మరువరాదని అన్నారు.

గడ్డంను భారీ మెజార్టీతో గెలిపించాలి

చేవెళ్ల/కందుకూరు/పరిగి/ఎల్‌బీనగర్/సరూర్‌నగర్ : ఎన్నికల్లో గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, పీసీసీ మెంబర్ సత్యనారాయణరెడ్డి కోరారు. చేవెళ్ల మండలం అల్లావాడ ఎంపీటీసీ సత్యనారాయణచారి, మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ విజయ్ తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పామెన మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మండలాధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, తదితరులున్నారు. రంజిత్‌రెడ్డి గెలుపు కోసం రాజకీయాలకతీతంగా కలిసి రావాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, జడ్పీటీసీ జంగారెడ్డిలు అన్నారు. కందుకూరు మండలం కందుకూరు, దెబ్బడగూడ కొత్తగూడ తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పాండురంగారెడ్డి, మల్లేష్, పాండు, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, రంజిత్‌రెడ్డిని గెలిపించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ కోరారు. పరిగి మండలం జాఫర్‌పల్లి, కిష్టమ్మగుడితండాలో ఇంటింటి ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డి విజయం తథ్యమని పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి గుర్రంగూడలోని గడ్డం ఎన్‌క్లేవ్‌లో యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



పరిగి : బాసుపల్లి మాజీ సర్పంచ్‌ను పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రూ.6.5 లక్షల గంజాయి పట్టివేత

● ఇద్దరు నిందితుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు

ఘట్‌కేసర్ రూరల్, మే 11 : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టుచేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని అవుటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబర్ 10 వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా ఓ కారులో రూ.6.5లక్షల విలువ చేసే గంజాయి పట్టుబడింది. దాంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మహ్మద్ సలీం, వెంకట్ బల్లప్పలను విచారించగా ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి.. హైదరాబాద్ పరిసరాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా, వారు జల్సాలకు అలవాటుపడి గంజాయి దందా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలి



కొత్తూర్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం

చౌదరిగూడ/కొత్తూర్,మే 11: కారు గుర్తుకు ఓటేసి మహబూబ్‌నగర్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శనివారం తుమ్మలపల్లి, రావిర్యాల, పద్మారం, గాలిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాంచంద్రయ్య, నిశ్చల్‌దీపక్, సుధాకర్, అంజయ్య, మహేందర్, పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం అని కొత్తూర్ బీఆర్‌ఎస్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్ అన్నారు. మున్సిపల్ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు సోమ్లా, కోస్గి శ్రీనివాస్, జె.శ్రీను, యాదయ్య పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని బలపర్చండి



ఇబ్రహీంపట్నం రోడ్ షోలో ప్రసంగిస్తున్న నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం, మే 11 : కేంద్రంలో మరోసారి రానుంది నరేంద్రమోదీ ప్రభుత్వమేనని, తెలంగాణలోనూ 10-12 సీట్లు బీజేపీకి ఇచ్చి బలపర్చాలని భువనగిరి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ కోరారు. శనివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన రోడ్ షోలో మాట్లాడారు. రేంవత్‌రెడ్డి ప్రభుత్వం అలవిగాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. మోదీ పాలనపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త అశోక్‌గౌడ్, పోరెడ్డి నర్సింహారెడ్డి, దయానంద్‌గౌడ్, కొప్పు బాష, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, భోజిరెడ్డి, దండె శ్రీశైలంయాదవ్, నర్సింహారెడ్డి, టేకుల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



మాట్లాడుతున్న చేవెళ్ల ఆర్డీవో సాయిరాం

చేవెళ్ల/ఆమనగల్లు/మొయినాబాద్ మే 11: ఈ నెల 13న సోమవారం జరిగే పోలింగ్‌లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకొని తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గంలో 2,69,960 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరికి 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, బీఎల్వోలు ఇప్పటికే ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారన్నారు. హోం వోటింగ్‌లో 312మంది ఓటు హక్కు ను వినియోగించుకున్నారని తెలిపారు. చేవెళ్ల మం డలం గొల్లపల్లి పరిధిలో ఉన్న బండారు శ్రీనివాస్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ సెం టర్‌ను ఏర్పాటు చేశామన్నారు. నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. ఓటర్లు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీసు శాఖ అన్ని రకాల భద్రతాఏర్పాట్లు చేసిందని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో మాట్లాడారు. ప్రలోభాలు, భయాలకు లొంగకుండా ఓటర్లు ఓటు వేసుకోవాలన్నారు. ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో 76 పోలింగ్ కేంద్రాల పరిధిలో 250 మంది స్థానిక, కేంద్ర పోలీసు బలగాల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. 65 పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి వసతి, ఆహారం వంటి వసతులు కల్పిస్తామని తెలిపారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఇబ్రహీంపట్నం: పార్లమెంటు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భువనగిరి నియోజకవర్గ ఏఆర్వో/ఆర్డీవో కె.అనంతరెడ్డి తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 3,39,341 ఓటర్లు ఉన్నారని, 343 పోలింగ్ కేంద్రాలు, 143 లొకేషన్లు ఉన్నాయన్నారు. గురునానక్ విద్యా సంస్థలో ఈవీఎంలను భద్రపరిచామని, అక్కడి నుంచే ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేస్తామన్నారు. 31 మంది సూపర్‌వైజరీ అధికారులు, 319 మంది బూత్ లెవల్ అధికారులను నియమించామన్నారు. మొత్తం 1,372మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. కాగా ఇప్పటి వరకు నగదు సహా రూ.4.18కోట్ల విలువైన వస్తువులను సీజ్ చేసనట్లు ఏఆర్వో వివరించారు.

రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలి

ఎన్నికలు సాఫీగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. 'పట్నం'లో కవాతు నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సైలు మారయ్య, షైబెల్లి, నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నాయి.

ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలి



తాళ్ల అంజయ్య

కందుకూరు, మే 11 : ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకొని నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని తెలంగాణ వినియోగదారుల ఫోరం మహేశ్వరం నియోజకర్గ ఇన్‌చార్జి తాళ్ల అంజయ్య కోరారు. శనివారం కందుకూరులో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును బాధ్యతగా భావించి తప్పక ఓటు వేయాలన్నారు. ఎన్నికల దృష్ట్యా సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించిందని ఓటు వేసేందుకే అన్నారు. ఓటర్లు ఇంటికే పరిమితం కాకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఉన్న యువత వృద్ధులు, వికలాంగులకు సహకరించి ఓటు హక్కును వినియోగించుకోవడానికి సహకరించాలన్నారు. దొంగ ఓట్లువేసే వారిపై అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల అధికారులు, స్థానిక విలేకరులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ ప్రేలాపనలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతున్నామన్న భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం షాద్‌నగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో గుండ్రాతి బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బస్వం, ముబారిజ్‌ఖాన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలపై బీఆర్‌ఎస్ నాయకులు బాల్‌రాజ్, రాజావరప్రసాద్‌ల పిచ్చివాగుడు సరికాదన్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లో కాంగ్రెస్ రోడ్‌షోకు 20వేలకుపైగా వచ్చిన జనం బీఆర్‌ఎస్ నాయకులకు కనిపించడం లేదా అన్నారు. బీఆర్‌ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించినట్టే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓడించడం తథ్యం అన్నారు.

ప్రతీ ఓటరు తప్పక ఓటు వేయాలి

● విలేకరుల సమావేశంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 11 : ప్రతీ ఓటరు తప్పక ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి శశాంక కోరారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఆర్వో కార్యాలయంలో చేవెళ్ల డీసీపీ శ్రీనివా స్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్/కౌంటింగ్ ఏర్పాట్లపై వివరాలను వెల్లడించారు. ఓటరు ఐడీ కార్డు లేకున్నా నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు వేయొచ్చన్నారు. ఈ నెల 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటున్న వారంతా ఓటు వేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంపునకు కృషిచేస్తున్నామన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లో మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలను, పోలింగ్ బూత్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 994 మంది హోం ఓటింగ్ ద్వారా ఓటు వేశారన్నారు.అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో గల స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపర్చామని, అక్కడ పోలింగ్ సిబ్బందికి ఆదివారం పంపిణీ చేస్తామన్నారు. చేవెళ్లలో 43 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, అందుకు ఒక్కో బూత్‌లో మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నామని అన్నారు. డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల భద్రత, ఏర్పాటు చేస్తామన్నారు. సెక్టార్‌ఆఫీసర్లు, పోలీసు టీములు, క్విక్ రెస్పాన్స్ టీములు, ఏసీపీ స్ట్రైకింగ్ ఫోర్సు, డీసీపీ, సీపీ, అడిషనల్ డీజీ స్థాయిల్లో పర్యవేక్షణ ఉంటుందన్నారు.

సామాజిక తనిఖీలో సిబ్బందికి జరిమానా

యాచారం, మే 11 : మండలంలోని 24పంచాయతీల్లో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ అధికారులు తనిఖీ నిర్వహించారు. రూ.4.48 కోట్ల విలువైన పనులపై శుక్రవారం రాత్రి 11గంటల వరకు ఓపెన్ ఫోరం నిర్వహించి నిధుల వినియోగంలో పొరపాట్లకు పాల్పడిన సిబ్బందికి జరిమానా విధించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.4,921, పంచాయతీ కార్యదర్శులకు రూ.17,277, టీఏలకు రూ.43,109, ఏపీవోకు రూ.6,071, ఫారెస్ట్ అధికారులకు రూ.2,04,258, పీఆర్ ఏఈకి రూ.8,560 చొప్పున జరిమానా విధించారు. కొన్నిచోట్ల పనులు చేయకున్నా బిల్లులు చెల్లించినట్లు తనిఖీ అధికారులు తేల్చారు. నాటిన మొక్కలపై నిర్వహణ కరువైందన్నారు.

దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా మహేందర్



మహేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న కిరణ్

షాబాద్, మే 11: బీజేపీ అనుబంధ దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా బోనగిరిపల్లికి చెందిన లింగాల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానని, ఎన్నికల్లో గెలుపే లక్ష్యం అన్నారు.

దేశ భద్రత-ధర్మ రక్షణ కోరే వారికి ఓటు వేయాలి



బండారి రమేష్

షాద్‌నగర్ అర్బన్, మే 11: భారత దేశ రక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ కోరే వారికే ఓటు వేయాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. సెక్యులర్ పేరుతో కుల మతాల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం శ్రీరాముడిని చులకన చేస్తూ మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అలాగే రాజ్యాంగానికి విరుద్ధంగా తమ మేనిఫెస్టోలను ప్రకటించిన వారికి ఓటు వేయొద్దని, రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడేవారినే ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ప్రజలు సంతోషంగా గడపాలన్న సంస్కృతిని, ధర్మాన్ని కాపాడే వారికే ఓటు వేయాలని రమేష్ కోరారు.

బీఆర్‌ఎస్‌లో గ్రూపులను పట్టించుకోనందుకే కాంగ్రెస్‌లో చేరాం

● పార్టీ మారిన కౌన్సిలర్ల వెల్లడి

శంషాబాద్, మే 11:బీఆర్‌ఎస్‌లో గ్రూపు విబేదాల ఉన్నాయని, వాటిని పార్టీ పెద్దలు పరిష్కరించకపోవడం వల్లే తాము కాంగ్రెస్ పార్టీలో చేరామని ఇటీవల పార్టీ మారిన కౌన్సిలర్లు అన్నారు. ఈ మేరకు రాళ్లగూడలోని తన నివాసం శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల పార్టీ మారిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బండి భాగ్యలక్ష్మిశ్రీకాంత్‌యాదవ్, ఇతర కౌన్సిలర్లతో కలసి సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ క్రమశిక్షణ గల పార్టీ అని నమ్మి తమ పార్టీ అభ్యర్థి విజయానికి మద్దతుగా తాము తమ వార్డుల్లో ప్రచారం చేశామన్నారు. పోటీ గ్రూపునకు చెందిన మరి కొందరు వేరుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విషయం పరిశీలించి తగు చర్యలు తీసుకొమ్మని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు దూడల వెంకటేశ్‌గౌడ్‌లకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. అలాగే తమ వార్డులకు కేటాయించిన నిధులు సైతం ఇవ్వలేదన్నారు. తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాలనే తాము కాంగ్రెస్‌లో చేరామని, ప్రభుత్వంలోని పెద్దలను ఒప్పించి నిధులు సాధించుకుంటాం అన్నారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు రాద్ధాంతం చేయొద్దన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు శ్రీకాంత్‌యాదవ్, స్రవంతి, శ్రీకాంత్‌యాద్, అమృత సుధాకర్‌రెడ్డి, శరత్‌బాబు, ఎం.శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మల్లు' విజయమే లక్ష్యంగా కృషి చేయాలి



విక్రమార్కకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రవి

ఆమనగల్లు, మే 11: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేనులు కృషిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న భట్టి శనివారం రాత్రి తలకొండపల్లి మండలం ఖనాపూర్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లు రవి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కిగౌడ్, ఇతర నేతలతో సమావేశమైయ్యారు. మల్లు రవి విజయంపై చర్చించి పార్టీ శ్రేనులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తొలిసారి కల్వకుర్తి నియోజకవర్గానికి వచ్చిన డిప్యుటీ సీఎం విక్రమార్కకు ఎమ్మెల్యే కసిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

గ్రామగ్రామాన నాయకుల పాదయాత్ర

యాచారం, మే 11 : సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం వరకు సాగింది. ఎండల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఉపాధి కూలీలను కలిసి శీతలపానీయాలు పంపించారు. నజ్దిక్‌సింగారంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాష, ఎంపీపీ సుకన్యబాషా, మండల బీజేపీ నాయకులు వి.రవీందర్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పి.శ్రీశైలం తదితరులు కూలీలకు అన్నదానం చేశారు. సాయంత్రం వరకు ఆయా పార్టీల కార్యకర్తలు నాయకులు ఇల్లిల్లు తిరిగి తమ పార్టీ గుర్తులకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కుల సంఘాల నాయకులను కలిసి వారి మద్దతు కోరుతున్నారు. ఓటర్ల మద్దతు కోసం కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు శతవిధాలా యత్నిస్తున్నారు.



నజ్దిక్‌సింగారంలో మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మితే మోసపోక తప్పదు



కడ్తాలలో బీఆర్‌ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం

కడ్తాల్/తలకొండపల్లి, మే11: బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మితే మోసపోయి గోస పడక తప్పదని కడ్తాల జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు కడారి రామకృష్ణ అన్నారు. తెలంగాణ భవిష్యత్తు కోసం బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. కడ్తాలలో శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ర్యాలీని ర్వహించారు. తలకొండపల్లి మండలం మాదాయిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజ్బుర్ రహెమాన్, మాజీ సర్పంచ్ హైమవతిరామస్వామి, నరేందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అబద్ధ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు

ఆమనగల్లు: అబద్ధ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని, మరోసారి నమ్మి ఆ పార్టీకి ఓటు వేయొద్దని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలకు మళ్లా పాత కష్టాలు మొదలయ్యాయని అన్నారు. ఆమనగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నట్టుగానే ఇప్పుడూ పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ బూటక వాగ్దానాలు ఇస్తోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్ర రాజకీయాలకు ఓటుతో ప్రజలు సమాధానం చెప్పాలన్నారు. నాయకులు రాంరెడ్డి, అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, నాగులు, వెంకట్‌రెడ్డి, ఆనంద్, తిరుపతిరెడ్డి, రాజశేఖర్, కొండల్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

యాచారం, మే 11: సార్వత్రిక ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని, ఎన్నికల సందర్భంగా 378మందిని బైండోవర్ చేశామని, పోలింగ్ కేంద్రాల్లో పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు వెల్లడించారు. శనివారం మాల్‌లో చెక్‌పోస్టుల వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. డివిజన్‌లో ఒక డీసీపీ, ఒక ఏసీపీ, ఆరుగురు సీఐలు, 28మంది ఎస్సైలు, 500మంది కానిస్టేబుళ్లు, 72 మంది సీఐఎఫ్ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీరంతా ఆదివారం మధ్యాహ్నం గురునానక్ కాలేజీ నుంచి గ్రామాలకు చేరతారన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే సుస్థిర పాలన



కొత్తూరు: ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్/కొందుర్గు/చౌదరిగూడ/కేశంపేట/షాద్‌నగర్ అర్బన్, మే 11 : ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజలకు సుస్థిరపాలన అందుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వలో శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి తరపున నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. పేదలకు, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, కేశంపేట జడ్పీటీసీ విశాల, వైస్ ఎంపీపీ శోభలింగం, మాజీ జడ్పీటీసీ ఎం.శ్యాంసుందర్‌రెడ్డి, ప్రభాకర్, రవికుమార్, ఖాజు, రవి పాల్గొన్నారు. షాద్‌నగర్ ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సాదిక్ కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో లాలాపేట్, చెర్కుపల్లి, రేగడి చిల్కమర్రి, టేకులపల్లి, ఉత్తరాస్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. సీపీఎం కాంగ్రెస్‌కు మద్దతుగా కొందుర్గులో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు వీరన్నపేట్, తుమ్మలపల్లి, లచ్చంపేట్, పద్మారం, ఎల్కగూడ, ఎదిర, కాస్లాబాద్, రావిర్యాల, వనంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలతో సమావేశమై వారి సమస్యలు విన్నారు. ప్రచారంలో ఎంపీటీసీ రజిత, చంద్రశేఖర్, ఎజాజ్, వెంకట్‌నర్సింహారెడ్డి, బాలయ్య, గోపాల్‌రెడ్డి, అఫ్సర్, వెంకట్‌రాములు, వేణు, చందు పాల్గొన్నారు. కేశంపేట మండలం సంగెం మాజీ సర్పంచ్ శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు కిషన్, బాలు, గోపాల్ ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తాని వారు అన్నారు. అలాగే దేవునిగుడితండా, కొండారెడ్డిపల్లి, కొత్తపేట, కేశంపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, ఇప్పలపల్లి, వేముల్‌నర్వలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

తలకొండపల్లి, మే 11: మండల పరిధి వెల్జాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకటాపూర్‌నకు చెందిన బైరపాక పరశురాములు కుటుంబాన్ని శనివారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. పరశురాములు మృతిపట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు సాయం అందజేశారు. ఆయన వెంట ఆంజనేయులుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, నిరంజన్, మల్లేశ్, వెంకటయ్య, దస్తగిరి, బాలస్వామి, భాస్కర్, బుచ్చయ్య, శ్రీరామ్, రమేశ్, ఆంజనేయులు ఉన్నారు.

కడ్తాల్: సాలార్‌పూర్‌నకు చెందిన గోట్యా, నార్లకుంట తండాకు చెందిన కీమ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను జడ్పీటీసీ దశరథ్ నాయక్ పరామర్శించారు.

ఎస్ఎస్టీ చెక్‌పోస్టు పరిశీలన

● వివరాలు అడిగి తెలుసుకున్న ఎన్నికల ప్రచార ఖర్చుల అబ్జర్వర్



చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలిస్తున్న ఖర్చుల అబ్జర్వర్ కుమార్ రాకేష్

ఇబ్రహీంపట్నం, మే 11 : ఎన్నికల దృష్ట్యా అభ్యర్థుల ప్రచార ఖర్చుల అబ్జర్వర్ కుమార్ రాకేష్ రంజన్ శనివారం మండల పరిధిలోని నాగార్జునసాగర్ ప్రధాన రహదారి బొంగులూరు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్టీ చెక్‌పోస్టును సందర్శించారు. చేపడుతున్న తనిఖీలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే శేరిగూడలోని 139వ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట సహాయ ఎన్నికల అధికారి, ఆర్డీవో కె.అనంతరెడ్డి ఉన్నారు.

డీకే అరుణను భారీ మెజారిటీతో గెలిపించాలి



కూలీలతో మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు, మే 11: మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం శ్రీరంగాపూర్, చిన్న ఎల్కిచర్ల, పర్వతాపూర్, సోమారంపహాడ్, అయ్యవారిపల్లి, తంగళ్లపల్లి, వెంకిర్యాల, విశ్వనాథ్‌పూర్, చెర్కుపల్లి, గంగన్నగూడలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత నవంబరులో జరిగినవి అసెంబ్లీ ఎన్నికలని, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు దేశానికి సంబంధించినవని, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలన్నారు. ఆలోచించి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో స్వర్గం చూపి అధికారంలోకి వచ్చిందని, హామీలను అమలు చేయలేదని, కాంగ్రెస్ నాయకులను హామీలపై నిలదీయాలన్నారు. పర్వాతాపూర్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడారు. గత పదేళ్లలో బీజేపీ అమలు చేసిన అభివృద్ధి పనులతో కూడిన కరపత్రాలను అందజేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి డీకే.అరుణను గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బలవంత్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ: మోసపూరిత గ్యారంటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. మండల పరిధి పెద్ద ఎల్కిచర్లలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణకు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో నీతి నిజాయితీకి మారు పేరైన బీజేపీనే గెలిపించాలన్నారు. పాలమూరు ముద్దుబిడ్డ, నరేంద్రమోదీ ఆశీస్సులతో లోక్‌సభ అభ్యర్థిగా పోటీలో ఉన్న డీకే.అరుణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రామకృష్ణారెడ్డి, అంతయ్య, వెంకటేష్, శ్రీశైలం, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

'కేంద్రంలో మూడోసారి బీజేపీదే అధికారం'

ఆమనగల్లు, మే 11: కేసీఆర్ పదేళ్ల పాలనలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తుంటే ఆ రెండు పార్టీలు కలిసి బీజేపీని దెబ్బతీసేందుకు ధన రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ నాయకులు అన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా బీజేపీ మూడోసారి అధికారం చేపట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లులో శనివారం బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా నాయకులు ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటు వేసి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం అన్నారు. కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, నర్సింహ, శ్రీకాంత్‌సింగ్, లక్ష్మణ్, ఝాన్సీశేఖర్, లక్యనాయక్, వెంకటయ్య, చెన్నకేశవులు, సాయి పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

ఇబ్రహీంపట్నం, మే 11: హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. భువనగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు ఓటు వేయాలని శనివారం రాయపోల్‌లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కృపేశ్, బుగ్గ రాములు, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీశైలం, జ్యోతి, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, బల్వంత్‌రెడ్డి, బాలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో మల్లు రవిని ఆదరించాలి'

ఆమనగల్లు/కడ్తాల్, మే 11 : నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంయగ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య కోరారు. నుచ్చుగుట్ట తండా, సాకిబండ తండా, జంగారెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కృష్ణ, ఖాదర్ ఖాద్రి, కొండల్, చందు, శ్రీను, బాబ, కుమార్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీతో జత కట్టారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందన్నారు. కడ్తాలలో మల్లు రవికి మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు నర్సింహ్మా, బిక్యనాయక్, బిచ్యానాయక్, జి.భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, వెంకటేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

క్వారీలో ఇంటర్ విద్యార్థి గల్లంతు



నితిన్(ఫైల్)

కేశంపేట, మే 11: కంకరాళ్ల తండాకు చెందిన ఇంటర్ విద్యార్థి మూడవత్ నితిన్(18) క్వారీలో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. రాజునాయక్-సుశీల దంపతుల కుమారుడు నితిన్ శనివారం మిత్రులతో కలిసి పుట్టోనిగూడ సమీపంలోని క్వారీలో ఈతకు వెళ్లాడు. నీటిలోకి దూకి నితిన్ పైకి రాలేదు. దీంతో మిత్రులు గ్రామస్థులకు సమాచారమిచ్చారు. తండావాసులు క్వారీ వద్దకు వెళ్లి నితిన్ కోసం గాలించారు. సాయంత్రం 6 అయినా నితిన్ ఆచూకీ దొరకలేదు. క్వారీలో నీరు ఎక్కువగా ఉండడంతో మృతదేహం లభ్యం కాలేదు. ఎన్డీఆర్‌ఎఫ్‌తో గాలిస్తే ఆచూకీ దొరుకుతుందని అంటున్నారు. క్వారీ వద్ద నితిన్ కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మాజీ సర్పంచ్ జగన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ లింగం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ

శంషాబాద్ రూరల్ మే 11 : మేడపై నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీచేసిన సంఘటన శనివారం తెల్లవారుజామున సుల్తాన్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాటకారి లక్ష్మమ్మ(60) శుక్రవారం రాత్రి ఇంటి మేడపై నిద్రించింది. అయితే దుండగుడు శనివారం తెల్లవారుజామున నిద్రిస్తున్న లక్ష్మమ్మ మెడలో నుంచి 4 తులాల బంగారు పుస్తెల తాడు లాక్కున్నాడు.దీంతో లక్ష్మమ్మ లేచి దొంగను పట్టుకునే ప్రయత్నం చేసింది. ఆమెను విదిలించుకొని దొంగ పారిపోయాడు. ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వారు లేచి వచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఇది తెలిసిన వారి పనే అని అనుమానించారు. క్రైం ఎస్సై రాజ్‌కుమార్ వివరాలు సేకరించారు. గ్రామస్తులు మేడలపై, వాకిళ్లలో నిద్రిస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

రూ.16వేల విలువైన మద్యం పట్టివేత

యాచారం, మే 11 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి మేడిపల్లిలో శనివారం రూ.16,153 విలువైన మద్యాన్ని పట్టుకున్నామని సీఐ ఎ.నర్సింహారావు తెలిపారు. సిబ్బంది గ్రామంలో దాడులు చేయగా గోగికార్ గీతాబాయి ఇంట్లో రూ.7,837.50విలువైన మద్యం, పద్మమ్మ ఇంట్లో దాడి చేయగా రూ.8,316 విలువైన మద్యం పట్టుకున్నామని సీఐ చెప్పారు.